అన్నదాతల అరిగోస

- మంచుకాలం.. రైతులకు శాపం
- పంట విక్రయానికి తేమ తంటా
- ధాన్యం ఆరబెట్టడానికి అవస్థలు పడుతున్న వైనం
- కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు


రాజాపల్లి గ్రామంలో హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారిపై ఆరబోసిన ధాన్యం

హుజూరాబాద్: ధాన్యంలో తేమ శాతం రైతులకు శాపంగా మారింది. మంచుకురిసే కాలం కావడంతో ఆరబోసిన ధాన్యంలో తేమ శాతం పెరుగుతోంది. దీంతో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. తేమ శాతం తగ్గే వరకూ కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షించాల్సి వస్తోంది. పంటలను ఇంటి దగ్గర ఆరబెట్టేందుకు సరైన స్థలం లేక పొలం నుంచి పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే వాతావరణ పరిస్థితులకు తోడు ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉండటంతో కొనుగోళ్లక అలస్యమవుతోంది. దానికి తోడు ఉదయం సమయంలో మంచు కురుస్తుండటంతో కాస్తోకూస్తో ఎండిన ధాన్యం కాస్తా మంచుకు తడిసి పోతోంది. ధాన్యం కాస్తా మంచుకు తడిసిపోతుంది. సాయంత్రం ఒక రాశికి తేమ శాతం 30 వరకు ఉంటే అదే ధాన్యం ఉదయం 40గా సూచిస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం 17 వరకు ఉండాలని ఆ విధంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామన్న నిబంధనతో ఎక్కువ మంది రైతుల ధాన్యం కాంటా కావడం లేదు.

తేమశాతమే ప్రధాన అడ్డంకి

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ శాతం నిబంధన ప్రధాన అడ్డంకిగా మారింది. తేమ శాతం 17 వచ్చే వరకు ఎండబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాక్టర్ లోడుతో ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులు ఆ ధాన్యాన్ని పలుచగా పోయడం కోసం డోజర్లను ఉపయోగిస్తున్నారు. అందుకోసం గంటకు రూ. 700 అద్దె చెల్లిస్తున్నారు. ఇలా ప్రతి గంటకు ఒక్కసారి ధాన్యాన్ని ఆరపోస్తున్నారు. కొనుగోళ్లు నిలిచి కేంద్రాల్లో ధాన్యం ఆరబోతలతో స్థలాభావం ఏర్పడుతోంది. దీంతో రాశులుగా పోసుకుంటున్నారు. రోజుకు మూడు సార్లు తేమశాతాన్ని పరిశీలించాల్సి ఉండగా చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కేవలం రెండుసార్లు మాత్రమే చూస్తున్నారు. దీనికి తోడు తేమ శాతం తెలిపే యంత్రాలు సరిపోను లేకపోవడంతో అన్ని ధాన్యం రాశుల్లో తేమశాతం చూడటం లేదని రైతులు వాపోతున్నారు. తేమ శాతం చూడాలని అధికారుల చుట్టూ తిరిగితేనే చూస్తున్నారని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు.

కేంద్రాల్లో పడిగాపులు

తేమశాతం 17 కంటే తక్కువగా ఉంటేనే కొనుగోలు చేస్తుండటంతో రోజులకొద్దీ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కా యాల్సి వస్తోంది. ఉదయం 10 గంటల వరకు చ లితో కూడిన మంచు కురుస్తుండటంతో ధాన్యం పచ్చిగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం విక్రయించడానికి నాలుగు రోజుల వరకు పడుతోందని, ఇన్ని రోజులు ధాన్యం కేంద్రంలో ఉంటే ఇంటి దగ్గర పనులు నిలిచిపోతున్నాయని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 10 వరకు మంచు కురుస్తోందని తద్వారా తేమ శాతం తగ్గడం కష్టంగా మారుతోందని, అధికారులు తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రోజుకు నాలుగుసార్లు ఎండపెడుతున్నాం



కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం నిబంధన చాలా ఇబ్బంది కలుగజేస్తోంది. ఉదయం మంచు కురిసి తేమశాతం పెరుగుతోంది. ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన తేమ తగులుతోంది. 17 శాతం నిబంధనను ఎత్తి వేయాలి. తేమ శాతం తగ్గించడానికి రోజుకు నాలుగుసార్లు ధాన్యాన్ని ఆరబోస్తున్నాం. రోజుల తరబడి కేంద్రాల్లో ఉంటే ఇతర పనులు చూసుకోలేకపోతున్నాం. తేమశాతం నిబంధన సరికాదు.

– శనిగరపు సరోజన, మహిళ రైతు, రాజాపల్లి

రైతుల బాధను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి



ధాన్యంలో తేమ శాతాన్ని తగ్గించేందుకు రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వరకు ధాన్యం రాశులను అటూఇటూ లాగుతూ తేమ శాతాన్ని తగ్గిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తే తేమశాతం పేరిటా కొర్రీలు పెట్టడం సరికాదు. రైతుల బాధలను ప్రభుత్వం అర్థం చేసుకొని కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి.

– మ్యాక సమ్మయ్య, రైతు సంఘం నాయకుడు, హిమ్మత్‌నగర్(వీణవంక)

క్లుప్తంగా

వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి


పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ప్రైవేటు వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పలు వివాహ శుభ కార్యాల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, నిజానపురం చందు, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, కొట్టె అశోక్, ముద్దం తిరుపతిగౌడ్, గుర్రం రాజేందర్ రెడ్డి, గుంటి స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు అందరూ సహకరించాలి


మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

చిగురుమామిడి: కులగణన సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. కులగణన చేపట్టడం వల్ల బీసీ రిజర్వేషన్ 21 శాతం నుంచి 42 శాతానికి పెరిగే అవకాశం ఉందన్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సమగ్ర కుటుంబ సర్వేను వ్యతిరేకించడం ఏంటని ప్రశ్నించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కొత్త పెన్షన్లు తక్షణమే ఇవ్వాలని, రూ.రెండు వేల పెన్షన్‌ను రూ.నాలుగు వేలకు, రూ.నాలుగు వేల పెన్షన్‌ను రూ.ఆరు వేలకు పెంచుతామని చేసిన హామీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల శంకర్, హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజు తదితరులు ఉన్నారు.

వారసంత ప్రారంభం


వారసంత ప్రారంభిస్తున్న దేవేందర్

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామంలో ఆదివారం సాయంత్రం కొక్కుల దేవేందర్ వారసంతను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు వారసంత మొదలవుతుందని, దీనికి కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు సహకరించిన గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు దేవేందర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రేనుకుంట్ల లచ్చయ్య, మాజీ ఎంపీటీసీ నేరెళ్ల కుమారస్వామి, జెకె, ముస్తఫా, రామకృష్ణ, సతీష్, రమేష్, సంజీవ్, సత్యం, హనుమంత్, రాజవీరు, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

గంగాధర: గామా ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలను అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ప్రాజెక్టు డైరెక్టర్ జోగు నరసయ్య సూచించారు. మండలంలోని మంగపేట, గ్రామంలో పది కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. గర్శకుర్తి, ముప్పిడిపల్లి, హిమ్మత్‌నగర్, ఓద్యారం గ్రామాల్లో ఆర్థిక భద్రత భరోసాలో భాగంగా ఒక్కో కుటుంబానికి రూ.1000 చొప్పున మొత్తం 70 కుటుంబాలకు నగదు అందజేశామన్నారు. గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ వారు అందిస్తున్న ప్రయోజనాలను ప్రజలకి వివరిస్తూ గ్రామాల్లో ఉన్న తెల్లరేషన్ కార్డు ప్రతి కుటుంబం వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ సెక్రెటరీ పాత్తూరి సురేశ్, చొప్పదండి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గజ్జెల సతీశ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెండు క్వింటాళ్ల కోత

శంకరపట్నం: ట్రాక్టర్ లోడ్ ధాన్యానికి మిల్లర్లు రెండు క్వింటాళ్ల కోత విధిస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలువేలి సమ్మిరెడ్డి ఆరోపించారు. గద్దపాక విండో పరిధిలో 40 కేజీలు తూకం వేయకుండా 42 కేజీల ధాన్యం తూకం వేస్తున్నారని, మిల్లర్లు, అధికారులు కుమ్మక్కయారని విమర్శించారు. తాలు, తరుగు పేరిట కోత విధిస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజేతలకు బహుమతులు ప్రదానం


బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో సీడ్‌వ్యాపారి సదాశివరెడ్డి స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆదివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బహుమతులు అందజేశారు. చింతగుట్ట గ్రామానికి చెందిన కరీంనగర్ ఆదిత్య హాస్పిటల్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి తండ్రి, సీడ్‌వ్యాపారి సదాశివరెడ్డి స్మారకార్థం తాడికల్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు నగదు, ట్రోఫీ బహూకరించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, మత్స్యగిరీంద్రస్వామి ఆలయ చైర్మన్ మల్లారెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ నాంపల్లి తిరుపతి, సంపత్, శ్రీధర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, అనంతరెడ్డి, షారూఖ్, శ్రీనివాస్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న మిత్ర బృందం


సరస్వతికి నగదు అందిస్తున్న మిత్రులు

ఆర్థిక సాయం, పరామర్శ

మానకొండూర్: మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నెల్లి రమేశ్, శ్రీనివాస్ భార్య ఉండింటి సరస్వతి కుటుంబాలను మిత్ర బృందం ఆదివారం పరార్శించి కుటుంబ సభ్యులకు రూ. 20 వేలు, ఇరవైఐదు కిలోల బియ్యాన్ని, సరస్వతి మిత్రులు రూ.8 వేలు అందించారు. కార్యక్రమంలో నెల్లి మరళి, రవీందర్, అనీల్, సతీశ్, అనంతుల రాకేశ్, జెట్టి శ్రీనివాస్, శ్రీకాంత్, అవినాశ్, శ్రావణ్, రాజు, మోదుంపల్లి మహేశ్, మల్లయ్య, ఆంజనేయులు, నజీమాసుల్తానా, కనకతార, సుమలత, అంజలి, కవిత తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం పరామర్శించారు. మండలంలోని తాడికల్, మక్త, గద్దపాక, కాచాపూర్ గ్రామాల్లో మృతుల కుటుంబాలను పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, ఇషామొద్దీన్, సదానందం, సంపత్, తిరుపతి, ఆరీఫ్, శంకర్, రాజయ్య ఉన్నారు.

‘సీఎం పర్యటన అడ్డుకుంటాం’

కరీంనగర్‌టౌన్: విద్యారంగ సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 25న కరీంనగర్‌లో జరుగనున్న సీఎం పర్యటనను విద్యార్థులతో కలిసి అడ్డుకుంటామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ అన్నారు. ఆదివారం నగరంలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి కనీసం స్పందించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు విజయ్, శివ, బీసీ సంక్షేమ, అనుబంధ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి

విద్యానగర్(కరీంనగర్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులు సత్తాచాటాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ అన్నారు. నగరంలోని తీగలగుట్టపల్లి మాత మాణికేశ్వర ఆలయ ఆవరణలో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై మాట్లాడారు. వైశ్యులు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక సేవ చేయడంలో వైశ్యులు ముందు వరుసలో ఉన్నారని, దీనివల్లే సంఘానికి ఎనలేని కీర్తి వస్తుందని తెలిపారు. భవిష్యత్‌లోనూ సేవా కార్యక్రమాలు ఈ విధంగానే కొనసాగించాలన్నారు. ఆర్యవైశ్య జిల్లా మహాసభ, యువజన సంఘం, మహిళా సంఘం, వాసవీ సేవాదళ్ సంఘం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి సన్మానించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ ప్రధాన కార్యదర్శి వెంకటేశం, కోశాధికారి శ్రీనివాస్, మీడియా కన్వీనర్ మహేందర్, ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షుడు రాజేందర్, మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులున్నారు.

కొత్త కూలిరేట్లు చెల్లించాలి


మాట్లాడుతున్న కొప్పుల శంకర్

హుజూరాబాద్: బండ హమాలీ కూలీలకు నూతన కూలిరేట్లతో వ్యాపారస్తులు డబ్బులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో హమాలీ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. బండ, బజారు హమాలీలకు పనిప్రదేశాల్లో మంచినీటి, ఇతర సదుపాయాలను కల్పించాలన్నారు. హమాలీ కార్మికులందరికీ బోనస్ సర్వీస్, పీఎఫ్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే కార్మికులకు వైద్య సదుపాయం కల్పించాలన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కదిరె రమేశ్, హమాలీ నాయకులు దాట్ల రత్నాకర్, మైస చేరాలు, రాచపల్లి శంకర్, కార్మికులు, మాట్ల చిరంజీవి, పోడిమలం వెంకటేశ్, మహేశ్, సారయ్య, మల్లన్న, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబికా మల్లికార్జున స్వామి నూతన కమిటీ


నూతన కమిటీ సభ్యులు

శంకరపట్నం: మండలంలోని చింతలపల్లి భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా పల్లె తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడి శనిగరపు శ్రీనివాస్, కోశాధికారిగా బొమ్మదేని సతీశ్, ప్రధానకార్యదర్శిగా బొంత గణపతి, ప్రచార కార్యదర్శి చింతల నవీన్, సభ్యులుగా కట్కూరి తిరుపతిరెడ్డి, కేశవేని అశోక్, పల్లె సదయ్య, దాసరి తిరుమల్‌రెడ్డి, పల్లె కోమల్‌రెడ్డి, మునిగంటి శ్రీకాంత్, సలహాదారుడిగా మంద శ్రీనివాస్‌రెడ్డి, శాశ్వత సభ్యుడు మంద గణపతిరెడ్డి ఎన్నికయ్యారు.

నాయీబ్రాహ్మణులను నియమించాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

గన్నేరువరం: నాయీబ్రాహ్మణులను ప్రత్యేకంగా గుర్తించిన దేవాలయాల్లోని కమిటీల సభ్యులుగా నియమించాలని నాయీబ్రాహ్మణుల సంఘం మండల అధ్యక్షుడు గర్షకుర్తి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాయీబ్రాహ్మణులకు గుడిలో ఉన్న ప్రధాన్యతను గుర్తించి ప్రతి గుడిలో పాలకవర్గసభ్యుడుగా ఉండే విధంగా జీవో ఇచ్చారు, తెలంగాణలో అలాంటి జీవో లేదన్నారు. దేవాలయాలయకు, నాయీబ్రాహ్మణులకు వృత్తిపరంగా ప్రత్యేకమైన సంబంధం ఉందని, సేవ చేయని గుడి లేదని, యాభై ఏళ్ల నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని, నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అమలు చేయాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు.



హుజూరాబాద్: పట్టణంలోని సిర్సపల్లి క్రాస్ రోడ్డు వద్ద హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రోడ్డు పక్కన వ్యవసాయబావి ప్రమాదకరంగా ఉంది. బావి చుట్టూ ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సమ్మయ్య, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్, సెల్: 70326 51516

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227




చెట్ల కొమ్మల తొలగింపు

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ నుంచి గన్నేరువరం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను జేసీబీ సహాయంతో తొలగింపు కార్యక్రమాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మార్గం మల్లేశం చేపట్టారు. కరీంనగర్ నుంచి మండలంలోని వివిధ గ్రామాలకు ఈ రోడ్డు గుండా ఆర్టీసీ బస్సు సౌకర్యం సంబంధిత అధికారులు కల్పించారని, బస్సు రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు చేపట్టామని తెలిపారు.

ఘనంగా గ్యార్మి పండుగ


గ్యార్మి జెండా వేడుకల్లో ప్రణవ్, నాయకులు, లారీ డ్రైవర్లు, క్లీనర్లు

జమ్మికుంట: పట్టణంలోని కోరపల్లి రోడ్డులో జమ్మికుంట లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గ్యార్మి జెండా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హాజరయ్యారు. ఈసందర్భంగా లారీ డ్రైవర్లు, క్లీనర్లు సమస్యలను విన్నవించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పొనగంటి మల్లయ్య, దేశినికోటి, బోగోని వీరన్నగౌడ్, సుంకరి రమేష్, పుల్లూరి సదానందం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి, లారీ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మానకొండూర్: నాలుగు దశాబ్దాలకు పైబడిన అనుబంధం వారిది. ఎప్పుడో చిన్ననాడు కలిసి చదువుకున్నారు. పదో తరగతి వరకు సహవాసం చేసిన స్నేహితులు ఆ తరువాత పెద్ద చదువులు, ఉద్యోగాలు, ఉపాధి వేటలో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వాళ్లంతా జీవితాల్లో పురోభివృద్ధికి శ్రమించారు. ప్రస్తుతం యాంత్రికమైన జీవితంలో పాత మిత్రులను కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకోవాలని.. ఎక్కడెక్కడో సెటిలైన మిత్రులందరూ జీవితాల్లో దూరం చేసుకున్న సున్నితమైన సంబంధాలు గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఆత్మీయ స్నేహితులను ఆలింగనం చేసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువుకున్న రోజుల్లో జరిగిన అనుభవాలను ఒకరికొకరు గుర్తుచేసుకున్నారు. చిన్నప్పటి చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా నవ్వుకున్నారు. అనంతరం విందు, వినోదాలతో సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. కరీంనగర్‌లోని కుమార్వాడి ఉన్నత పాఠశాల 1983-84 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులందరూ ఆదివారం మానకొండూరు మండలంలోని ఖాదర్‌గూడెంలోని అరవింద ఫామ్ వేదికగా గెట్ టుగెదర్ ఏర్పాటు చేసుకున్నారు. ఇంజనీర్లు, టీచర్లు, లెక్చరర్లు, వ్యాపారవేత్తలు.. ఇలా ఒక్కో రంగంలో స్థిరపడ్డ 120 మంది విద్యార్థులు ఒకే చోట కలుసుకొని చిన్ననాటి అనుభవాలను పంచుకున్నారు. జీవితంలో ఒడిదిడుకులు ఇప్పుడున్న స్థితిగతులన్నీ ముచ్చటించుకున్నారు. తవు అపూర్వ కలయికను ఫొటోల రూపంలో శాశ్వత జ్ఞాపకంగా మలుచుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు పింగళి మల్లారెడ్డి, బుడిమె రఘును శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.